# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్ రాజు





## అమెరికులాసా కథ – 202

### మూడు స–మోసాల కథ

**'దేశ భాషలందు తెలుగు లెస్స' ఎందుకు** అయిందంటే కొన్ని పదాలకి స అనే అక్షరం ముందు చేరిస్తే ఆ పదం బల పడుతుంది అనుకోవచ్చు కానీ ఆ పప్పులు అస్తమానూ ఉడకవు. ఉదాహరణకి సవినయం అంటే వినయంతో, సగర్వం అంటే గర్వంగా, సకాలం అంటే సరి అయిన సమయం....కానీ....సమయం అంటే మయంతో కూడిన అనడానికి వీలు లేదు, సహాయం అంటే హాయంగా అనడానికి అంతకన్నా వీలు లేదు. అలాంటిదే ఈ స–మోసా అనే పదం. మామూలుగా అయితే అదేదో బంగాళా దుంపల కూరతో కూరిన పంజాబీ సమోసాయో, బఠాణీ గింజలూ, శనగ పప్పూ దట్టించిన గుజరాతీ సమోసాలో గుర్తుకొచ్చి నోరు ఊరే అవకాశం ఉంది కానీ....నా ప్రాణాలకి స–మోసా అనగానే మోసం తో కూడిన అనే పదే పదే అర్థం అవుతుంది. దానికి కారణం గత మూడు నెలలలో నేను మూడు స–మోసాలు తిని పోవడం...అనగా మూడు సార్లు మోస పోవడం.

మొదటి స–మోసా నా మొహానికి పట్టిన గతి. "మగాడయినా మడిసన్నాక బుగ్గలు నున్నగా ఉండాల...నా లాగ" అని మా క్వీన్ విక్టోరియా అప్పుడప్పుడు నా మొహం లో ఇంకా ఉన్న చిన్నప్పటి మొటిమల గాట్లు మీద సెటైర్లు విసిరినా ఒక సారి కాస్త పౌడర్ గట్టిగా దట్టించి, సూటూ, బూటూ వేసుకున్న ఫొటో ఎప్పుడో పదేళ్ళ క్రితం ముఖ పుస్తకం అనే ఫేస్ బుక్ లో పెట్టుకున్నాను. ఇప్పుడు ఆ దిక్కుమాలిన ఫేస్ బుక్ ఫొటో నాకు స–మోసా తినిపించింది. ఇక్కడ దిక్కుమాలిన అనే విశ్లేషణాత్మక పదం ఫేసు బుక్ అనే పదానికి అన్వయించును కానీ నా అందమైన ఫొటో కి కాదు అని గమనించ గలరు. మూడు నెలల క్రితం నా మొదటి స–మోసా గాడు ఎవరో కానీ ఆ ఫొటోనే వాడి, నా పేరుతోటే ఒకానొక అబద్ధం ఫేస్ బుక్ ఎకౌంట్ తెరిచాడు...అంటే మా ట్రంప్ గారి భాషలో "ఫేక్ ఫేస్ బుక్ ప్రొఫైల్" అనమాట. అంతే కాదు, నేను..అంటే ఆ దొంగ వంగూరి గాడు తను ఫ్రాన్స్ దేశం రాజధాని పారిస్ లో తెలుగు సాహితీ సదస్సుకి వెళ్ళినట్టూ, అక్కడ పాస్ పోర్ట్, క్రెడిట్ కార్డ్ అన్నీ ఎవరో దొంగతనం చేసినట్టూ, అంచేత ఆ పరాయి దేశంలో దిక్కుతోచక ఇరుక్కుపోయినట్టూ, తనకి అర్జెంటుగా అమెరికా వెనక్కి రావడానికి విమానం టికెట్టు కొనిపెట్టి కాపాడమనీ, వెనక్కి రాగానే ఆ డబ్బు పువ్వుల్లో పెట్టి వెనక్కి ఇచ్చేస్తాను అనీ, టికెట్ కొనుక్కోడానికి ఫలానా విధంగా డబ్బు పంపమనీ నా

పేరిట కంటి నీరు తెప్పించే అభ్యర్ధన నా ఫేస్ బుక్ మిత్రులు చాలా మందికి పంపించాడు. కానీ ఆ ఉత్తరం అందుకున్న నా మిత్రులు ఎవరూ ఇలా' చెవిలో పువ్వులు' పెట్టించుకునే వారు కానే కాదు కాబట్టి, విషయం నాకు తెలియజేయగానే వెంటనే ఆ స-మోసా గాడి ఫేక్ ప్రొఫైల్ తీయించేశాను....తీయించేసి నా ఫేస్ కి ఉన్న కాస్తో, కూస్తో పరువు కాపాడుకున్నాను అనే అనుకుంటున్నాను. నాకు తెలియకుండా నా పేరు, ఫొటో, ఇతర వివరాలు దొంగతనం చేసి, అవి వాడుకుని, ఇతరులని మోసం చేసి డబ్బు దండుకోవడం ఈ మొదటి స-మోసా ప్రత్యేకత. ఈ మొదటి స-మోసా గాడు ఖచ్చితంగా మన పవిత్ర భారతీయుడే కాక, అపవిత్ర తెలుగు వాడే అని నా నమ్మకం....ఎందుకంటే నా ఫేస్ బుక్ లో నేను తెలుగు తప్ప మరొక భాష ఎప్పుడూ వాడ లేదు. అందులో నా మిత్రులు అందరూ తెలుగోళ్ళే! అంచేత ఈ దొంగ కూడా మనోడే!.

ఇక రెండో స-మోసా..ఇది అసలు, సిసలు సైబర్ క్రైమ్...దాని వేదిక అంతర్జాలంలో డబ్బు లావాదేవీలు చేసే పే పాల్ అనే అంతర్జాల వేదిక. చాలా ఏళ్ళ క్రితం ఇది మొదలు పెట్టిన వాడు ఇప్పుడు అమెరికాకి రాజు కాని రారాజు ఇలాన్ మస్క్ వీరుడే. నేను గత పదేళ్ళగా ఈ దిక్కుమాలిన పే పాల్ ఎకౌంట్ అడపా తడపా వాడుతూనే ఉన్నాను. ఇక్కడ కూడా ఈ దిక్కుమాలిన అనే విశ్లేషణాత్మక పద ప్రయోగం పే పాల్ కి అన్వయించును కానీ నా ఎకౌంట్ కి కాదు అని గమనించ గలరు. ఈ రెండో స-మోసా గాడు చాలా పకడ్బందీగా పెద్ద గేలమే వేశాడు. అనగా ఐదారు నెలల క్రితం చాప కింద నీరులా ముందు నా పే పాల్ తాళం చెవి ..అనగా యూజర్ నేమ్, పాస్ వర్డ్ లు కనుక్కుని, లోపలికి ప్రవేశించి, వెనకాల ఎక్కడో దాకుని ఉన్న నా ప్రొఫైల్ లో తన దొంగ ఇమైల్, నా జాతీయ బేంక్ లోనే తను తెరిచిన ఎకౌంట్ నెంబర్ నమోదు చేశాడు. అవి వాడి నా బేంక్ నుంచి పే పాల్ చార్జెస్ అనే పేరిట ఏదో నామకహా పది డాలర్లు నా పే పాల్ అకౌంట్ కి పంపించాడు. ఈ పే పాల్ లో ఉన్న అతి పెద్ద ఇబ్బంది ఏమిటో అప్పుడు నాకు తెలీదు కానీ ఈ రెండో స-మోసా గాడికి స్పష్టంగా తెలుసు...అనగా పే పాల్ లో మన ఎకౌంట్ కి ఎవరైనా విరాళం/డబ్బు పంపినా, మనం అక్కడ నుంచి మన బేంక్ కి పంపించుకున్నా అదంతా "daily transactions" లో కనపడుతుంది. కానీ....మన బేంక్ నుంచి డబ్బు విత్ డ్రా చేసి పే పాల్ లో మన ఎకౌంట్ కే డబ్బు పంపిస్తే అది ఆ డైలీ ట్రాన్స్ ఏక్షన్స్ లో కనపడదు. వెనకాల ఎక్కడో దాక్కుంటుంది. కానీ మన బేంక్ లో అలాంటిది ఏదైనా కనపడగానే మనం పేపాల్ లో వెతకడం మొదలు పెట్టే లోపలే మటు మాయం అయిపోతుంది. అదన మాట ఈ రెండో స-మోసా దొంగ ప్లాన్. అక్కడ నేను ..ఒకటా, రెండా....మూడు రోజుల్లో పది వేల డాలర్లకి దొరికి పోయాను. అనగా ఈ రెండో దొంగ అతి తెలివిగా లోపలికి ప్రవేశించి, పే పాల్ వాళ్ళ పేరే వాడి, వారం రోజుల్లో నాలుగు విడతలలో నా బేంక్ నుంచి ఇంచుమించు పది వేల డాలర్లు పేపాల్ లో నా ఎకౌంట్ కీ, వెనువెంటనే అక్కడ నుంచి తన బేంక్ ఎకౌంట్ కీ డబ్బు కాజేశాడు. మొదట $1,999 నా బేంక్ నుంచి పేపాల్ కి ట్రాన్స్ ఫర్ అవగానే నేను వాళ్ళని పిలిచి అడిగినప్పుడు వాళ్ళ కస్టమర్ సర్వీస్ ఎంత పరమ నికృష్టంగా ఉంటుందో

తెలిసింది. ఈ తెర వెనుక భాగవతం, దొంగ ఇమెయిల్, దొంగ బేంక్ ఎకౌంట్ నా ప్రొఫైల్ లో చూడడం, రోజు వారీ ట్రాన్స్ ఏక్షన్స్ లో కనపడని లావాదేవీలు, మనం పదే పదే అడిగితే కానీ వివరాలు చెప్పక పోవడం...ఇలా పది, పది హేను ఫోన్లు, ఇమెయిల్స్ ద్వారా నా పేపాల్ ఎకౌంట్ హైజాక్ అయింది అని తెలియడం, మా బేంక్ వాళ్ళు బాగా సహకరించడం తో మొత్తానికి ఆ పది వేలూ మళ్ళీ నాకు రావడానికి నెల్లాళ్ళు పట్టింది. దీని నీతి ఏమిటనగా....మనం ఎక్కడ డబ్బు లావాదేవీలు పెట్టుకున్నా, అక్కడే దొంగలు కాచుకుని ఉంటారు. అన్నింటి తాళం చెవులూ అస్తమానూ మార్చుకుంటూ కొత్త తాళాలు వేసుకోవాలి....

ఇక మూడోదీ...మరొక రకం సమోసా...దీని పేరు గిఫ్ట్ కార్డ్....ఈ సారి స-మోసాకి బలి పశువుని అవబోయి మానేశాను..మా అమ్మాయి ధర్మమా అని. అసలు జరిగినది ఏమిటంటే..మా క్వీన్ విక్టోరియా గారి తమ్ముడి ఇంట్లో ముగ్గురు కూచునే పెద్ద సోఫా, ఇద్దరు కిచ కిచలాడుతూ కూచోడానికి వీలైన లవ్ సీట్ అనే చిన్న సోఫా, కాళ్ళు పైకి పెట్టి కునుకు తియ్యడానికి రిక్లైనర్ అనే పడక్కుర్చీలు ఉంటాయి. అన్నీ నిగ నిగ లాడే తోలు సోఫాలే. అదేమిటో కానీ “తోలు సోఫా”, అన్నా “చర్మం సోఫా” అన్నా వినడానికి ఎబ్బెట్టుగా అస్సలు బాగా లేదు కదా!. అవును మరి....ఇలాంటి చోట తెలుగు భాష లెస్సే!. దాన్నే “లెదర్ సోఫా సెట్” అన్నాం అనుకోండి. అబ్బో..ఆ లెవెలే వేరు. నా ప్రాణాలకి మా క్వీన్ విక్టోరియా మొన్నీ మధ్య “మనమూ తోలు సోఫాలూ, పడక్కుర్చీలూ కొనుక్కుందామా” అనగానే “వద్దు, మనమేమైనా డాక్టర్లమా? మడత కుర్చీలు చాలుగా” అంటే నా తోలు తీసేస్తుందేమో అని కించిత్తు భయపడి ” అంత డబ్బు ఎక్కడిదీ?” అని సాగ దీశాను. “ఇప్పుడు ఉన్న సోఫాలు అమ్మి పారెయ్. మిగతా డబ్బు అప్పు చేసెయ్” అని సలహా ఇచ్చి పారేసింది మా క్వీన్ విక్టోరియా.

మరి మా ఇంట్లో ఉన్నది ఆరు విడి విడి భాగాలు కలిపిన సెక్షనల్ టైపు సోఫా. అవి కుషన్ కోసం లోపల కొబ్బరి పీచు, లేదా అదేదో ఫోమ్ ఉన్నా, పైకి షోగ్గా ఉండే కాటన్ కవర్ తో చూడ్డానికి బాగానే ఉంటాయి. కానీ నేను ఐదేళ్ళగా ఒకే చోట కూచునే అలవాటు కాబట్టి ఆ ఒక్క భాగం వెలిసిపోయి బూడిద పులిమినట్టు ఉంటుంది. అలాగే ఆవిడ కూడా నాకు ఆమడ దూరం లో మరొక చోటనే ఐదేళ్ళగా కూచుని టీవీ సీరియల్స్ చూస్తుంది కాబట్టి ఆ కన్నీళ్ళతో తడిసి రంగు మారి పోయి ఉంటుంది. అంచేత “ఇహ తప్పేదేలే” అనుకుని ఆ వెలిసి పోయిన భాగాల మీద దుప్పటీ కప్పేసి, మొత్తం సోఫా కి రక రకాల భంగిమలలో ఫొటోలు, వీడియోలు తీసి “ఇక్కడ సకల వస్తువులూ, సరుకులూ, సర్వీసులూ దొరుకును” అనే క్రైగ్స్ లిస్ట్ అనే ఆన్-లైన్ మార్కెట్ లో మా ఇంట్లో ఉన్న ఆరు భాగాల క్లాత్ కవర్ సోఫా సెట్ ని అమ్మకానికి పెట్టాను. ఇలా ప్రకటన పెట్టానో లేదో, ఒక రోజులో అర డజను మంది “మీ ఇంటి చిరునామా చెప్పండి. వచ్చి సోఫా చూస్తాం” “మీ బేంక్ సమాచారం పంపండి. వెంటనే డబ్బు పంపించేస్తాం”, “దారిలో ఉన్నాం. మీ సబ్ డివిజన్ ఏమిటీ? లోపలికి రావడానికి మీ గేట్ కోడ్, మీ ఇంటి చిరునామా పంపండి”..అన్నీ ఇలాటి మెసేజ్ లు చూసి,

ఎందుకైనా మంచిది అని మా అమ్మాయికి ఫోన్ చేసి చెప్పాను. అవన్నీ విని మా అమ్మాయి పడీ పడీ తన ఆంధ్రా–అమెరికన్ నవ్వు నవ్వింది. "వీళ్ళందరూ కేటు గాళ్ళూ, నాన్నా, సోఫా కొనడం వంక పెట్టుకుని మన పేట లోకి, ఇంట్లోకి వచ్చి అటూ, ఇటూ చూసి వీలుంటే అప్పుడేనో, లేకపోతే తర్వాత ఎప్పుడైనానో చిన్న చిన్న వస్తువులు దొంగతనం చేస్తారు." అని మా అమ్మాయి అలాంటి దొంగల ముఠాల గురించి వివరించింది. ఆ సలహా వలన మా ఇంటికి ఈ చిన్న చిన్న స–మోసా గాళ్ళు రాకుండా జాగ్రత్త పడ్డాను.

ఈ లోగా నా ఫోన్ లో మరొక ఆసక్తికరమైన మెసేజ్ వచ్చింది. దాని ప్రకారం అమెరికా లో ఆన్–లైన్ మనీ ట్రాన్స్ ఫర్ చేసే Zelle ప్రక్రియ వారి నుంచే డైరెక్ట్ గా నాకు వచ్చింది. వాళ్ళు ఫలానా బ్రెండా సమోసా అనే అమ్మాయి ఎకౌంట్ నుంచి నాకు సోఫా ఖరీదు అయిన $1000, అదనంగా సోఫా పిక్ అప్ రవాణా ఖర్చుల నిమిత్తం మరొక $500 పంపిస్తున్నట్టు, దానికి నా Zelle ఎకౌంట్ రిజిస్టర్డ్ ఇమెయిల్ ఏమిటో తెలియజేయగానే డబ్బు అందుతుందీ అనే ఆ మెసేజ్ సారాంశం. ఇదేదో బాగానే ఉంది కదా, వీళ్ళు ముందు మొత్తం డబ్బు జమ చేస్తాను అన్నారు కానీ నా చిరునామా అడగ లేదు కదా..అని ధైర్యంగా నా ఇమెయిల్ సమాచారం పంపాను. వెంటనే వాళ్ళ దగ్గర నుంచి ఇమెయిల్ వచ్చింది. "ముందు వాగ్దానం చేసినట్టు మీకు ఇప్పుడే $1500 పంపించేశాం. ..కానీ బేంక్ సెక్యూరిటీ నిబంధనల ప్రకారం మీరు..అనగా సదరు వంగూరి గారు దొంగ కాదు, నిజంగానే సోఫాలు అమ్ముతున్న పెద్ద మనిషి అని తెలియడానికి ఒక చిన్న పని చేసిపెట్టాలి. మీ ఇంటి దగ్గర ఉన్న వాల్ మార్ట్ కానీ మరేదైనా కానీ స్టోర్ కి వెళ్ళి కేవలం $400 కి ఏపుల్ గిఫ్ట్ కార్డ్ కొని, ఆ కార్డ్ రెండు వేపులా ఫొటో తీసి మాకు పంపండి. అంతే. వెనువెంటనే మా బేంక్ వారు డబ్బు రిలీజ్ చేసి మీ బేంక్ లో $1500 వేసేస్తారు. దీని వలన మీకు అదనంగా $100 ఎక్కువ ముదుతుంది కదా!." – ఇదీ Zelle వారి ఇమెయిల్ సారాంశం. వెంటనే నాకు ఏదో దుర్వాసన వేసి, ఎందుకైనా మంచిది అని ఈ మెసేజ్ ని మా అమ్మాయికి పంపించాను. ఇది చూడగానే మళ్ళీ మా అమ్మాయి పడీ పడీ నవ్వింది...తర్వాత కోప్పడింది. "వాళ్ళ కి నీ Zelle ID ఎందుకు పంపావూ? నువ్వు అమాయకుడిలా అలా గిఫ్ట్ కార్డ్ ఫొటో పంపగానే వాళ్ళు దాన్ని కేష్ చేసేసుకుంటారు. ఇక అంతే సంగతులు. నీకు నాలుగు వందల డాలర్లు. గోవిందా...గోవింద.." అదీ తన కోపం సారాంశం.

"మరి ఆ మెసేజ్ డైరెక్ట్ గా Zelle వాళ్ళ నుంచి కదా" అని నేను నసుగుతూ ఉంటే "అవును. నీకు ఆ మధ్య ఐశ్వర్యా రాయ్ నుంచీ, నాకేమో అమితాభ్ బచ్చన్ నుంచీ మెసేజ్ లు వచ్చాయిగా అలాగే ఇదీనూ"...పడీ, పడీ నవ్వు కి అదీ కారణం. ఇక్కడ నాకు ఎందుకో "టెంకి జెల్ల" అనే ప్రక్రియ అర్జంట్ గా గుర్తుకొచ్చి నా తల వెనకాల భాగం ఒక సారి తడుముకున్నాను. అదే లెండి. మా క్వీన్ విక్టోరియా అర్ధరాత్రి ఉద్యోగం చేసేటప్పుడు నాకు ఓ టెంకి జెల్ల కొట్టి, నిద్ర లేపి ఉద్యోగానికి వెళ్ళిపోయేది. ఇప్పుడు ఈ జెల్ దొంగలు అది గుర్తు చేశారు.

ఈ కథలో నీతి ఏమిటీ అనగా..సమోసా తినండి. మోస పోకుండా జాగ్రత్త పడండి.

**COMMENTS**